# "మేడ్ ఫర్ ఈచ్ అదర్"

వేలినేని ఉష

సడన్ బ్రేక్‌తో బస్ ఆపాడు రవీంద్ర

'ఏందహ ఇక్కడాపావు?'' సూపర్‌వైజర్ కీచు గొంతుతో వెనకనుండి అరిచాడు.

రవీంద్ర కళ్ళు రెప్ప వేయడం మర్చిపోయాయి కవి విశ్వనాథవారి కావ్య నాయకిలా ఉన్న ఆ బంగారు తీగ వయ్యారంగా బస్ ఎక్కింది

"టింగ్, టింగ్" మంటూ సూపర్‌వైజర్ బెల్ మోగించాడు డ్రైవర్ రవీంద్ర ఈ లోకంలోకి వచ్చాడు. బస్‌ను ముందుకు దూకించాడు.

అతని చేతుల్లో మెత్తగా సాగిపోతోంది బస్. కాలేజీ వచ్చింది. ఆమె అక్కడే దిగింది. రవీంద్ర ఒళ్ళంతా కళ్ళు చేసుకుని చూశాడు

అది సిటీ బస్. నెంబర్ నైన్‌టీన్. రవీంద్ర ఇంటర్ చదివాడు. అతనికి డ్రైవింగ్ హాబీ. చదువుకు తగ్గ ఉద్యోగంలో సుఖం లేదని సిటీ బస్‌లో డ్రైవర్‌గా చేరాడు. సంస్కారవంతుడు, యువకుడు కాలేజీ అమ్మాయిలంతా అతనంటే ఎంతో మోజు చూపిస్తారు. ప్రత్యేకం అతని డ్యూటీలోనే ఆ బస్ ఎక్కుతారు అంతా.

ప్రస్తుతం కాలేజీ తెరిచిన రోజులు ఆమె బస్ స్టాప్‌కు రాబోతుండగా మధ్యలోనే బస్ వెనుకనుండి వస్తోంది. ఆమె యథృచ్ఛికంగా చెయ్యెత్తి బస్ ఆపమన్నట్టుగా వూపింది. రవీంద్ర అప్రయత్నంగా బస్ ఆపాడు.

డ్యూటీ దిగి ఇంటికి వెళ్ళిపోయినా రవీంద్ర మనసు ఆమె గురించి ఆలోచిస్తూనే ఉంది. "ప్రేమ గుడ్డిది. వయసు పిచ్చిది" అన్న సామెత రవీంద్ర విషయంలో ఆరోజు నిజమయింది.

తల్లి పెట్టిన గుత్తొంకాయ కూరలో అతనికి అదివరకటి రుచి తెలియలేదు. ముద్ద మందారంలాటి ఆమె వికసిత వదనం కళ్ళల్లో తిరిగింది.

"ఏమిటిరా ఆలోచన?" తల్లి శ్యామల కసురుకుంది. ఉలిక్కి పడ్డాడు "నాకు ఆకలి లేదమ్మా!" అంటూ కంచం ముందు నుండి లేచిపోయాడు. శ్యామల తెల్లబోయింది. డ్యూటీ చేసి రాగానే నచ్చిన కూరలతో శుభ్రంగా తిని కావాల్సినంతసేపు నిద్రపోవడం కొడుకు అలవాటు అటువంటిది అన్నం వదిలేసాడంటే. ఏమ్మై ఉంటుంది? అనుకుంది. ఆవిడకు రవీంద్ర కాక మరో కూతురు ఉంది. కూతురు పెళ్ళి చేసి అత్తారింటికి పంపారు తగ్గ సంబంధంవస్తే రవీంద్ర పెళ్ళి చేయాలనే ఆలోచనలో ఉన్నారు ఆవిడ భర్త ఫోస్ట్‌మాస్టర్‌గా వేస్తున్నాడు

* * * * * *

మర్నాడు డ్యూటీ ఎక్కాకా రవీంద్ర కాలేజీ మిదుగా వస్తున్న ప్రతి డ్యూటీలోనూ ఆ మెరుపుతీగకోసం తెగ చూసాడు. ఇనుప కడ్డీలతో చేసిన గేట్లు, లోపల బిల్డింగులు తప్ప అతను ఆశించిన వ్యక్తి కనబడలేదు.

ఈ వెధవ డ్రైవర్ డ్యూటీ అంటే మొదటిసారిగా చిరాకు పుట్టింది. 'ఈ ఉద్యోగం మూలానా కనీసం కాలేజీ దగ్గర కాపు వేసి ఆమెను చూసే అవకాశం లేదే? అనుకుని దిగులు పడ్డాడు.

"ఏం గురూ! ఇవాళ చాలా విసుగ్గా ఉన్నావు?" మార్కెట్ దగ్గర బస్ ఆపి ఎదురుగా హోటల్‌లో టీ గ్లాసులు రెండు తెచ్చి ఒకటి రవీంద్ర కిచ్చి మరొకటి తను తీసుకుంటూ అడిగాడు కండక్టర్ భరత్.

'కుర్రాడికి పెళ్ళిగానీ కుదిరిందేమో" ముసలి సూపర్‌వైజర్ రాజారావు జోక్ వేసాడు.

రవీంద్ర నవ్వేసి ఊరుకున్నాడు. అతనిలో అందరినీ ఆకర్షించే ప్రత్యేకత అదే. ఏ విషయానికైనా నవ్వుతూ తప్పించుకుంటాడు. ఎక్కువగా మాట్లాడడు. తనకు అక్కరలేని విషయాల్లో తల దూర్చడు. ప్రతిదానికి చిఱునవ్వే సమాధానంగా చూపిస్తాడు

"నాయనా! పెళ్లాడకు. జీవితం అంటే థ్రిల్ ఉండదు" కండక్టర్ కాకలు తీరిన ప్లీడర్, అనుభవం తెలీని తన క్లయింట్‌కు సలహా ఇచ్చినట్టుగా గొప్పగా ఫోజ్ పెట్టాడు.

మార్కెట్ దగ్గర బస్ ఐదు నిమిషాలు ఆగుతుంది. ఖాళీగా ఆగి ఉన్న బస్‌లోకి ఒకొక్కరు వచ్చి ఎక్కుతున్నారు. డ్రైవర్, కండక్టర్, సూపర్‌వైజర్ ఆ ఐదు నిముషాలు లోకాభిరామాయణం మాట్లాడుకుంటారు. మిగిలిన సిటీ బస్‌లు కూడా అక్కడ ఆపుతారు. ఒకరినొకరు అభిమానంగా గురూ అనీ, బావా అనీ, బ్రదర్ అనీ పలకరించుకుంటూ సిటీ బస్‌ల వర్కర్స్ కూడా స్నేహపాత్రులని నిరూపించుకుంటారు.

"అదేం? మీ ఆవిడ బాగానే చుక్కలా ఉంటుందిగా!" రవీంద్ర నవ్వుతూ అడిగాడు ఫిలాసఫర్‌లా పెళ్ళి చేసుకున్నందుకు చింతిస్తున్న భరత్‌ను.

"లాభంలేదు బ్రదర్! పెళ్ళి అయిన మగవాడిని ఏ ఆడపిల్ల అయినా అన్నయ్యా అంటూ పరిహసెట్టి ఏలిచేస్తుంది. సాయంత్రం కాలేజీ వదిలాకా చూడు. జనంలో మునిగిపోయి ఊపిరి ఆడక ఉక్కిరి బిక్కిరిఅయి యమధర్మరాజులా ఒక్కళ్ళనీ వదలక టికెట్ కొట్టే నన్నెవరూ లెక్క చేయరు. అద్దాలనుండి వచ్చే చల్లగాలి ఆస్వాదిస్తూ ఎదురు అద్దాలనుండి కనబడే అప్సరసలను తిలకిస్తూ సుతారంగా డ్రైవ్ చేస్తావు. పూలరంగడిలా కనబడే నిన్నే గమనిస్తారు అమ్మాయిలంతా" కండక్టర్ విచారంగా అన్నాడు.

"ఏడ్చావులే. ముందు టీ డబ్బు లిచ్చేసిరా! టైమ్ అయింది పోదాం" అంటూ రవీంద్ర హారన్ పెద్దగా మోగించాడు. అప్పటికే బస్‌లో సీట్లన్నీ నిండిపోయాయి. పుష్పక విమానంలా, వయ్యారంగా కదిలింది బస్. రవీంద్ర చేతిలో ఉన్న డ్రైవింగ్ నైపుణ్యం అదే.

కాలేజీ ముందుకు వచ్చేసరికి కాలేజీ వదిలారు. అమ్మాయిలు స్టయిల్‌గా, రాజకుమార్తెల్లా ఎక్కేది బస్‌కాదు. విమానం అన్నంత గర్వంగా తలలు ఎగరేస్తూ, తలలు దించుతూ రక రకాల భంగిమలలో తమ విలాసం చూపిస్తూ బస్ ఎక్కసాగారు. మగవాళ్ళ కళ్ళన్నీ వాళ్ళమీదే అంటుకుపోయి కళ్ళు అటూ ఇటూ తిరగడం, మానేశాయి. చివరకు ముసలి తాతయ్యలు కూడా కళ్ళతో పాటు కళ్ళద్దాలు కూడా అమ్మాయిలకే అంకితం చేసేసారు.

హంసల్లా ఎగలుపోతూ అలా ఎక్కే అమ్మాయిలనుచూస్తూ స్టీరింగ్ ముందు కూర్చుని తల మాత్రం స్టయిల్‌గా వెనక్కి తిప్పి అమ్మాయిలకు చక్కటి ఫోజులిస్తూ హీరో కృష్ణలా అభినయంచేసే రవీంద్రకు ఇవాళ ఆ అమ్మాయిలను చూడాలంటే వెగటు పుట్టింది. వాళ్ళు మాత్రం అందమైన బస్ డ్రైవర్ తమని గమనించటానికి పాటుపడుతూ బస్ నిండిపోయారు.

బస నిండింద కాన రవీంద్ర ప్రేమ దేవత రాలేదు. "రైట్ గురుగారూ!" సూపర్‌వైజర్ బెల్ మోగించాడు.

గేర్ మార్చబోతున్న రవీంద్ర కళ్ళు కాలేజీ గేటు దగ్గర ఆగిపోయాయి. ఆమె వస్తుంది.

అంతే సూపర్‌వైజరు ఎంత బెల్ మోగించినా ఫలితం లేకపోయింది. ప్రైంమినిష్టర్ వచ్చాకనే పార్లమెంటు ప్రారంభం అయినట్టు ఆమె తనూ లత బస్‌లో చేరాకనే బస్ స్టార్టు అయింది. ఆమె ఆ జనంలో జరుగుతూ జరుగుతూ డ్రైవర్ సీట్ దగ్గరగా వచ్చేసింది.

రవీంద్ర ఓరకంట ఆమెను చూస్తూ సుతారంగా

డ్రైవ్ చేయసాగాడు.

"గురు! మన బస్, ఆర్. టి. సి వాళ్ళు పుచ్చుకున్నారా?" భరత్‌కు అనుమానం వచ్చి గట్టిగా అరిచాడు.

'లేదే ఏం?" రవీంద్ర ఆశ్చర్యపోయాడు.

"ఆర్ టి. సి వారి బస్‌లా నత్తనడక నడిపిస్తున్నావుగా అందుకు" భరత్ మాటకు బస్‌లో అంతా ఘొల్లున నవ్వారు. ఆమె కూడా నవ్వింది. ఆ నవ్వు చూసాడు రవీంద్ర. అతనికి రోషం వచ్చింది. తన శక్తి నిరూపించుకోవాలన్నట్టు వీరాంజనేయుడిలా అయిపోయాడు. బస్ ఆఘ మేఘాలమధ్య ఉరికించాడు. నిలబడ్డ అమ్మాయిలంతా ఆ వేగానికి ఒకరిమీద ఒకరు పడిపోతూ కంగారుగాను, హుషారుగాను కేరింతలు కొట్టసాగారు. పుష్పవిలాపంలా అందం గమనిస్తున్నారు కళ్ళద్దాల తాతయ్యలు.

అలా వేగంగా ప్రతి స్టాపింగ్‌లోను బస్ ఆపిన వెంటనే రయ్యిన డ్రైవ్ చేసేస్తున్నాడు రవీంద్ర. జనం ఎక్కేది, దిగేది కూడా గమనించటంలేదు

ఆ బంగారు తీగ కూడా డ్రైవర్ చేష్టలనే గమనిస్తూ అతని వెనుకగా నిలబడింది.

ఆమె పేరు విశాలి. ఆడిటర్ ఆఫీసర్‌గారి ఒక్కగానొక్క అమ్మాయి. అందంలో ఫస్ట్. చదువులో చురుకు. తెలివిలో జీనియస్. బి. ఎ. ఫస్టియర్‌లో జేరింది. పెళ్ళిళ్ళు స్వర్గంలోనే జరుగుతాయట. అందుకే ఆమెను ఆకర్షించాలని ప్రయత్నిస్తున్న ఆ సుకుమారి మనసులో రవీంద్ర రూపం పడింది.

* * * * * *

ఆరోజు నుండి ఆమె రవీంద్ర ప్రతి డ్యూటీలో అదే బస్ ఎక్కసాగింది. అతని దగ్గరగా నిలబడో కూర్చునో అతడినే అబ్జర్వ్ చేయసాగింది. మూడు నెలలు తిరిగేసరికల్లా ఒకరిమీద ఒకరికి ఆకాశమంత నమ్మకం, భూదేవి అంత ప్రేమ పెరిగాయి. మిత్రుడు వ్యవహారం కండక్టర్ భరత్ గమనించేసాడు. దాంతో డ్రైవర్‌గారి కాబోయే శాల్తీకి టికెట్ కొట్టడం మానేశాడు. దాంతో ఆమె మొదట సిగ్గు పడినా తరువాత గర్వంతో పొంగిపోయింది. రెగ్యులర్‌గా ఆ బస్‌లో ఎక్కే అమ్మాయిలు కూడా స్నేహితురాలి ప్రేమాయణం కనిపెట్టేసారు. అక్కడితో బస్‌లో ఉన్నంతసేపూ ఆ ప్రేమ జంటమీద జోక్‌లు విసరసాగారు. విశాలి బుగ్గలు సిగ్గుతో ఎరుపెక్కిపోయేయి. రవీంద్ర కళ్ళు కొంటిగా నవ్వేయి.

అటువంటి శుభ సందర్భంలో ప్రేమ మైకంలో మునిగి తేలుతున్న రవీంద్ర చేతులు స్టీరింగ్ నుండి తప్పాయి పక్కకు. దాంతో పక్కనున్న మున్సిపాలిటీ గోడకు ముద్దు పెట్టుకుంది బస్ వెళ్ళి. బస్‌లో హాహాకారాలు మిన్నుముట్టాయి. రవీంద్ర తల వెళ్ళి అద్దానికి కొట్టుకుంది. అతనికి స్పృహ తప్పిపోయింది.


సింపుల్‌గా జరిగిన యాక్సిడెంట్ కాబట్టి బస్‌లో ఎవరికి ప్రాణాపాయ స్థితి రాలేదు కానీ శరీరాల్లో అక్కడక్కడ చిన్న గాయాలు తగిలాయి.

కళ్ళద్దాల తాతయ్యలు భయంతో కళ్ళద్దాలు కిందకు వదిలేసారు. అవి ఫటా ఫటామంటూ విరిగిపోయాయి.

సురక్షితంగా బైటపడ్డ అందరూ రవీంద్ర దగ్గరకు పరుగు పెట్టారు. అతన్ని హాస్పటల్‌కు తరలించారు. బస్‌లో అందరూ అతన్నిచూసి బోలెడు సానుభూతి చూపించి "ఎవరికి వారే యమునాతీరే" అన్నట్టుగా



## గడుసులోకం –బాబు




# "మేడ్ ఫర్ ఈచ్ అదర్"

వెళ్ళిపోయారు. విశాలి మనసు అలా వెళ్ళటానికి ఒప్పలేదు. రవీంద్ర ఎందుకు యాక్సిడెంట్ చేసాడో ఆమె గ్రహించింది.

అందుకే ఆ బస్‌స్టాఫ్‌తో ఆమె హాస్పటల్‌కు వెళ్ళింది. అతడి నుదుట గుచ్చుకున్న గాజు పెంకులు లాగేసి అందంగా కట్టుకట్టారు నర్సులు. బస్ ఓనర్ వచ్చాడు. విషయం అంతా సేకరించాడు. తరువాత పోలీసులు వచ్చారు (ఇక అదంతా ఓనర్, చూసుకున్నాడనుకోండి.)

రవీంద్రకు స్పృహ వచ్చింది. పక్కనే నిలబడ్డ నెచ్చెలిని చూడగానే అతనికి తను చచ్చి స్వర్గం వెళ్ళిన అనుభూతి కలిగింది. కానీ లబో దిబో మంటూ వచ్చిన అమ్మా, నాన్నను చూసి ఆ అనుభూతి దూరంగా పారిపోయింది.

రవీంద్ర . శరీరం ఆరోగ్యంగానే ఉంది. తల్లీ, తండ్రికి నచ్చచెప్పాడు "ఐయామ్ ఆల్ రైట్!" అంటూ.

"రవీంద్రా! యు ఆర్ డిస్‌మిస్‌డ్!" రావణాసురుడిలా గంభీర కంఠంతో అతను చేసిన తప్పుకు శిక్ష విధించాడు బస్ ఓనర్‌గారు.

దాంతో రవీంద్ర ప్రేమ హృదయంలో ఫిరంగులు పేలాయి. తన డిస్‌మిస్సా? మరైతే తన ప్రియభామినిని ఎలా చూసుకోగలడు? ఆ క్షణంలో ఆమె కనుక అక్కడ లేకపోతే ఓనర్‌గారి కాళ్ళు పట్టుకుని డ్యూటీ వేయించుకునేవాడు. కానీ ప్రేయసి ముందు తన ఇమేజ్ తగ్గించుకోలేక, అలా అని ఉద్యోగం వదులుకోలేక యన్టీఆర్‌లా తలవాల్చి దీర్ఘాలోచనలో మునిగిపోయాడు.

ఆ భంగిమలో ప్రియుని చూసిన విశాలి హృదయం విశ్వనాథవారి ఏకవీర హృదయంలా కరిగి నీరైపోయింది. హాస్పటల్ అంతా పాకిపోతున్న ఆమె కన్నీరు చూచి కృష్ణగానీ పొంగిపోయిందా!" అంటూ కంగారుపడి నర్సులూ. డాక్టర్స్ అంతా మెయిన్‌రోడ్‌మీదకు పరిగెత్తుకు వచ్చారు.

"ఏమి మా చెల్లమ్మ ఘాటు ప్రేమ" అంటూ భరత్ డ్రైవర్ ప్రేమగాథ ఓనర్‌గారికి వివరించాడు.

విన్న ఓనర్ అవాక్కయ్యాడు తలఎత్తి విశాలిని ఏదో అనబోయాడు. అంతలో "బేబీ వాట్ హాపెండ్?" అంటూ విశాలి తండ్రి ఆడిటర్ ఆఫీసర్ శ్రీనివాసరావుగారు లోపలకు వచ్చేసారు.

ఓనర్‌గారు ఆయన్ని చూడగానే సినీ నటుడు గుమ్మడిగారిలా యమశాంతంగా మారిపోయి, సత్యనారాయణ పోజ్ ఇస్తూ ఆడిటర్‌గార్ని కౌగలించుకున్నాడు. ఆ ఇద్దరూ అలా కౌగిలిలో అంటుకుపోయారు.

'మనకా ఛాన్స్ ఎప్పుడు?' అన్నట్టు విశాలి, రవీంద్ర కళ్ళు కలిసి విడదీయలేనట్టుగా అతుక్కుపోయాయి.

కండక్టర్ భరత్ ఎంతో శ్రమ పడి చివరకు ఎలాగైతేనేం ఆ కౌగిలి, ఈ కళ్ళు విపార్టుకాపార్టు విడదీసి దూరంగా నిలబట్టాడు. ఆ ఓనర్‌గారు, ఈ ఆఫీసర్‌గారు స్నేహితులని అర్థం అయిపోయింది అతడికి.

"మీ బేబీ లవర్, అదే మా డ్రైవర్ బహు యోగ్యుడు. అందగాడు, మాటగాడు, ఆటగాడు. అతనికి నా దగ్గర ఉద్యోగం జీవితాంతం గ్యారెంటీ!" గయుడికి హామీ ఇస్తున్న అర్జునుడిలా చెప్పాడు ఓనర్‌గారు.

అంతే "వాట్! మా బేబీ లవరా?" అంటూ శ్రీనివాసరావు అమ్మవారు పూనినట్టుగా ఉగ్రంగా తాండవం చేయసాగాడు. హాస్పటల్ అదిరిపోయింది. కృష్ణానది వరదలు తగ్గి భూకంపంగానీ వచ్చిందా దేవుడా! అంటూ హాస్పటల్ స్టాఫ్ భయంతో మళ్ళీ బైటకు పరిగెత్తారు.

అర్జంట్‌గా బస్ తెచ్చి ఆ ఉగ్ర నరశింహావతారాన్ని పెద్ద యాక్సిడెంట్ చేయాలన్నంత కోపం వచ్చింది డ్రైవర్ రవీంద్రకు. నిస్సహాయంగా ప్రేయసి కళ్ళలోకి చూసాడు.

కళ్ళతోనే ధైర్యం చెప్పింది విశాలి. కన్నీరు మున్నీరుగా దుఃఖిస్తూ తండ్రిని శాంతపరచింది.

ఈసారి రైస్ కాలువ పొంగిందంటూ హాస్పటల్‌లో గగ్గోలు పుట్టింది.

దేవతల ప్రార్థనతో ఉగ్రం తగ్గించుకున్న నరశింహుడిలా గారాల కూతురు కన్నీటి ప్రార్థనకు పూర్తిగా ఐస్ అయిపోయి చివరకు తియ్యని క్రీమ్‌గా మారిపోయాడు శ్రీనివాసరావు. కూతురి ప్రేమను ఆమోదించాడు తన బస్ మూలంగా రవీంద్రకు పట్టిన అదృష్టానికి తానే అదృష్ట దేవత అయినట్టుగా ఓనర్‌గారు రవీంద్రను చల్లగా చూసారు.

మూడు నెలల నుండి కొడుకులో వస్తున్న మార్పు. అతడికి పెళ్ళిమీద వస్తున్న ఇంట్రస్టు గమనిస్తున్న రవీంద్ర అమ్మ, నాన్నకు అభ్యంతరంపెట్టే అవసరం రాలేదు. కొడుకు సుఖమే తమ సంతోషం అనుకున్నారు.

విశాలి, రవీంద్ర హృదయాలు అప్పుడే ఈస్ట్‌మన్ కలర్‌లో విహరించసాగాయి. కండక్టర్ భరత్ పెద్దగా విజిల్ వేసాడు. ఫలితం సున్నా! కలల్లో తేలిపోతున్న రవీంద్ర, విశాలి బెదర్లేదు, కదల్లేదు. తండ్రులూ+తల్లీ మురిపెంగా చూసుకున్నారు. నాగయ్యలా మంచి మనసుతో దీవించారు ఓనర్‌గారు ఆ ప్రేమ జంటను. □

ఈ కథ ఏ బస్ సంస్థనూ, ఏ వ్యక్తులనూ ఉద్దేశించి రాసినది కాదు. కేవలం హాస్యానికి రాసాను. నేనీ కథ రాయడానికి స్ఫూర్తినిచ్చిన మిత్రులు సత్యం (డ్రైవర్)గారికి కృతజ్ఞతలు.

-రచయిత్రి